# ఐబొమ్మ..రీ ఓపెన్ !

**-కొత్త మూవీలతో కళకళలాడుతున్న పైరసీ సైట్**
**-వెబ్‌సైట్ పునరుద్ధరణతో సినీ పెద్దల విస్మయం**
**-సాంకేతికతను వాడుకుంటూ డొమైన్లను మారుస్తున్న ముఠా**
**-నెట్‌వర్క్‌ను ఛేదించడం పోలీసులకు సవాల్**




హైదరాబాద్

టాలీవుడ్‌ను పైరసీ భూతం మళ్లీ వెన్నాడుతోంది. ఒకవైపు డిజిటల్ విప్లవం, మరోవైపు పైరసీ సైట్ల దాడితో కుదేలవుతున్న చిత్ర పరిశ్రమకు ఐబొమ్మ రూపంలో మరో భారీ షాక్ తగిలింది. ఈ సైట్ నిర్వాహకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రవి అరెస్ట్ కావడంతో ఇక ఐబొమ్మ అధ్యాయం ముగిసిందని అంతా భావించారు. కానీ, ఎవరూ ఊహించని విధంగా రవి బెయిల్‌పై విడుదలైన కొద్ది రోజులకే ఆన్‌లైన్‌లో మళ్లీ ఈ సైట్ ప్రత్యక్షమవ్వడం ఇప్పుడు ఇండస్ట్రీలో కలకలం రేపుతోంది. గతంలో ఐబొమ్మ రవిని పోలీసులు అరెస్ట్ చేసినప్పుడు పైరసీకి అడ్డుకట్ట పడుతుందని నిర్మాతలు ఊపిరి పీల్చుకున్నారు. అప్పట్లో సైట్ పూర్తిగా నిలిచిపోయింది. అయితే, తాజాగా వెబ్‌సైట్ పునరుద్ధరించబడటమే కాకుండా, థియేటర్లలో ఉన్న కొత్త సినిమాలు సైతం అందులో ప్రత్యక్షమవ్వడం పట్ల సినీ పెద్దలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రవి బెయిల్‌పై రావడం, వెంటనే సైట్ ఆపరేషన్లు మొదలవ్వడం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను ఛేదించడం పోలీసులకు సవాలుగా మారింది. సాంకేతికతను వాడుకుంటూ డొమైన్లను మారుస్తూ వస్తున్న ఈ పైరసీ ముఠాను అరికట్టడంలో ఎక్కడ లోపం జరుగుతుందనే చర్చ మొదలైంది. ఇప్పుడు పోలీసులు మళ్లీ రవి కోసం వేట మొదలు పెట్టారు.

# సోనియాకు.. అస్వస్థత

మొదటి తరువాయి

**కేరళ పర్యటనను రద్దు చేసుకుని..**

సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరారన్న వార్త తెలియగానే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన కేరళ పర్యటనను రద్దు చేసుకుని హుటాహుటిన ఢిల్లీకి చేరుకున్నారు. కోజికోడ్ లో జరగాల్సిన ర్యాలీలో వర్చువల్ గా పాల్గొంటూ.. "ఒక కొడుకుగా నా తల్లి ఆరోగ్యం పట్ల ఆందోళన చెంది ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నాను. కేరళ ప్రజలు నా పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను" అని భావోద్వేగంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో తన తల్లిని ప్రతి గంటకూ పర్యవేక్షిస్తూ తనకు ధైర్యాన్నిచ్చిన ఓ కేరళ నర్సు గురించి రాహుల్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత కొన్నేళ్లుగా సోనియా గాంధీ తరచూ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చి 24న జ్వరం, ఇన్ఫెక్షన్ కారణంగా గంగారామ్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. అలాగే గతేడాది జూన్ 7న, అంతకుముందు కూడా జీర్ణకోశ సంబంధిత సమస్యలతో పలుమార్లు ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. తాజాగా మరోసారి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే ప్రస్తుతం సోనియా గాంధీ క్షేమంగా తిరిగి రావడంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి.

# హిందూయిజం ఒక జీవన విధానం

మొదటి తరువాయి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బీ వరాలే, జస్టిస్ ఆర్ మహాదేవన్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ కూడా ఉన్నారు.

శబరిమల ఆలయ ప్రవేశ తీర్పు - పునఃసమీక్ష పిటిషన్లపై విచారణ

శబరిమల ఆలయ ప్రవేశ తీర్పును 2018 సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు ఇచ్చింది. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని 4:1 మెజారిటీతో ఆనాడు సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. 2018 నాటి ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పునఃసమీక్ష పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. దీనిపై తమ వాదనలను కూడా వినాలంటూ పలువురు మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. ఈ విచారణలో భాగంగా బుధవారం మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జీ. మోహన్ గోపాల్ వాదనలు వినిపించారు.

**ఇప్పుడందరూ వేదాలను అంగీకరిస్తున్నారా?**

"హిందూ మతంలోని పలు వర్గాల నుంచే సామాజిక న్యాయం కోసం డిమాండ్ వస్తోంది. హిందూయిజాన్ని ఒక మత వర్గంగా నిర్వహించారు. మతం, తత్వశాస్త్రానికి సంబంధించిన అన్ని విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరించేవాడే హిందువు అని 1966లో తీర్పు ఇచ్చారు. హిందువులందరి అభిప్రాయాలను తీసుకోకుండానే గతంలో కోర్టులు ఈవిధంగా ఒక నిర్ణయానికి వచ్చాయి. హిందువుల్లో ఎవ్వరూ ఎప్పుడూ అలా చెప్పలేదు. నాకు వేదాల పట్ల అత్యంత గౌరవం, గొప్ప ఆరాధనా భావం ఉన్నాయి. కానీ, నేడు హిందువులుగా పరిగణించే ప్రతి ఒక్కరూ అన్ని ఆధ్యాత్మిక, తాత్విక విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరిస్తున్నారన్నది వాస్తవమేనా?" అని మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జీ. మోహన్ గోపాల్ సుప్రీంకోర్టులో వాదన వినిపించారు.

**అందుకే హిందూ మతాన్ని జీవన విధానం అంటారు**

ఈ వాదనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ, "అందుకే హిందూ మతాన్ని ఒక జీవన విధానం అంటారు. ఒక హిందువు హిందువుగా ఉండటానికి తప్పనిసరిగా గుడికి వెళ్లడం గానీ, ఏదైనా ఆచారం పాటించడం గానీ అవసరం లేదు" అని ఆమె పేర్కొన్నారు. "ఆచారబద్ధంగా ఉండాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ విశ్వాసాన్ని కలిగి ఉండటానికి ఎవరూ అడ్డు రాలేరు" అని జస్టిస్ నాగరత్న తెలిపారు. "ఒక వ్యక్తి హిందూ మత విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి, గుడిసెలో దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ సందర్భంగా కీలక వ్యాఖ్య చేశారు.

# కేంద్ర ప్రభుత్వమే పొదుపు చేయాలి

మొదటి తరువాయి

ఇంకా వారికి ప్రాధాన్యం ఉందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీ కలిసి పోటీ చేసినా కాంగ్రెస్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. మూడు పార్టీలు కలిసి వచ్చినా తెలంగాణలో 30 శాతం ఓట్లను దాటలేవని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పదవి కంటే పీసీసీ చీఫ్‌గా పనిచేయడంలోనే తాను ఎక్కువ సంతోషం, గర్వం పొందుతున్నానని మహేష్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్ విస్తరణ

మొదటి తరువాయి

ఖోస్రోషాహి వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ ఎక్సలెన్స్ సెంటర్ ను విస్తరిస్తున్నట్టు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేననీ, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్టు ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తిగా ఉన్నామని దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు సీఎం సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ చార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది.

హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామనీ, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీవో) మధు కన్నన్, ఉబెర్ ఇండియా సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# బలపరీక్షలో నెగ్గిన విజయ్

మొదటి తరువాయి

ప్రభాకర్ ప్రకటించారు.

మే 13వ తేదీలోగా మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ఆదేశించిన నేపథ్యంలో బుధవారం 'ఫ్లోర్ టెస్ట్' నిర్వహించారు. విశ్వాస పరీక్షపై తీర్మానాన్ని సీఎం విజయ్ ప్రవేశపెట్టారు. తమిళనాడు అసెంబ్లీ చర్చ సందర్భంగా తొలుత మాట్లాడిన కాంగ్రెస్ సభ్యులు తాము విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న తొలి మూడు నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత వామపక్షాలు విజయ్‌కు మద్దతు ప్రకటించాయి. సీఎం విజయ్ ప్రమాణస్వీకారానికి ముందు గవర్నర్ అర్లేకర్ పలుమార్లు తిరస్కరించిన తీరుపై సీఎం అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడులో గవర్నర్ రూల్ను అడ్డుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం తమిళనాడు హక్కులను కాలరాస్తోందని సీపీఐ ఆరోపించింది. విజయ్ ఐదేళ్లపాటు కొనసాగాలని వీసీకే ఆశాభావం వ్యక్తం చేసింది. అయితే ఓఎస్డీగా వ్యక్తిగత జ్యోతిష్యుడిని విజయ్ నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. విజ్ఞానశాస్త్రానికి సీఎం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఏఐఏంఏంకే బహిష్కృత ఎమ్మెల్యే



కామరాజు సైతం విజయ్‌కు మద్దతు ఇచ్చారు. ఒక్క ఎమ్మెల్యే ఉన్న డీఎండీకే సైతం విజయ్‌కు మద్దతు తెలిపింది.

**డీఎంకే వాకౌట్ :**

డీఎంకేతో పాటు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం వ్యతిరేకించాయి. బలపరీక్షకు ముందుగానే విజయ్, తమిళనాడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. 65 శాతం తమిళనాడు ఓటర్లు విజయ్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారని పేర్కొన్నారు. తమ కూటమి పక్షాలతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారని విజయ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమిళనాడులో రీల్ ప్రభుత్వం కాకుండా రియల్ ప్రభుత్వం ఉండాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఓటింగ్‌కు దూరంగా ఉంటామని చెబుతూ 59 ఎమ్మెల్యేలు ఉన్న డీఎంకే వాకౌట్ చేసింది.

**తటస్థంగా బీజేపీ :**

అయితే బీజేపీ మాత్రం ఈ ఓటింగ్‌లో 'తటస్థంగా' ఉండాలని నిర్ణయించింది. అన్బుమణి రామదాస్ నేతృత్వంలోని పీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు వెల్లడించింది. మరోవైపు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం విజయ్‌కు ఓటు వ్యతిరేకంగా ఓటు వేస్తామని ముందే చెప్పింది. విజయ్ ప్రభుత్వం తమ పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలకు డబ్బు ఆశ చూపి ఆకర్షించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. మరోవైపు అన్నాడీఎంకే షణ్ముగం వర్గం పళనిస్వామి వ్యాఖ్యలను ఖండించింది. 25 మంది షణ్ముగం వర్గం ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మొదటి తరువాయి

ఒకవైపు భగ్గుమంటున్న ఎండలు, మరోవైపు ఈదురు గాలులు, ఉరుములు-మెరుపులతో కూడిన అకాల వర్షాలు సంభవించే పరిస్థితులు ఉన్నందున ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, తదుపరి రోజుల్లో జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూడా ఎండల తీవ్రత పెరిగే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని, ఎండలో పనిచేసే వారు తలకు రక్షణ కల్పించే వస్త్రాలు ధరించాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. వడదెబ్బలు, ఎండ తీవ్రత కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వడదెబ్బ నివారణ చర్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. రైతులు, కూలీలు, నిర్మాణ కార్మికులు, రహదారులపై పనిచేసే కార్మికులు ఎండ తీవ్రత సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈదురు గాలులు, ఉరుములు-మెరుపులు సంభవించే ప్రాంతాల్లో ప్రజలు చెట్ల కింద నిలబడకుండా, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# విరాట్ సూపర్ సెంచరీ

మొదటి తరువాయి



రాణించడంతో కోల్‌కతా నిర్ణీత ఓవర్లలో 192/4 స్కోరు చేసింది. వరుసగా నాలుగు విజయాల తర్వాత కేకేఆర్‌కు ఇది తొలి ఓటమి కాగా ఓవరాల్‌గా ఆరో పరాభవంతో ప్లేఆఫ్స్ అవకాశాలను దాదాపుగా వదులుకుంది.

కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్

ఛేదనలో బెథెల్ (15) మరోసారి తేలిగ్గానే వికెట్ సమర్పించుకున్నా గత రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన కోహ్లీ.. ఈసారి రెచ్చిపోయి ఆడాడు. వైభవ్ తొలి ఓవర్లోనే నాలుగు బౌండరీలు బాదిన రన్ మెషీన్.. పడిక్కల్ అండగా చెలరేగి ఆడాడు. 21 పరుగుల వద్ద అతడు ఇచ్చిన క్యాచ్‌ను కవర్స్ వద్ద పావెల్ జారవిడవడంతో ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కోహ్లీ.. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. వరుస బౌండరీలతో పరుగుల వేటకు దిగిన పడిక్కల్ సైతం బ్యాట్ ఝుళిపిస్తూ బౌండరీలతో రెచ్చిపోగా పది ఓవర్లలో బెంగళూరు 101/1తో సాఫీగా లక్ష్యం వైపుగా సాగింది.

అదే జోరుతో కోహ్లీ.. 32 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. అయితే రెండో స్పెల్‌లో బంతినందుకున్న కార్తీక్.. పడిక్కల్‌ను ఆఫ్ కట్టర్‌తో బోల్తా కొట్టించి 59 బంతుల్లోనే 92రన్స్ జోడించిన మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. రజత్ పాటీదార్ (11), టిమ్ డేవిడ్ (2) నిరాశపరిచినా కోహ్లీ మాత్రం రెచ్చిపోయి ఆడాడు. అనుకుల్ ఓవర్లో 4, 6తో 90ల్లోకి వచ్చిన అతడు.. అరోరా 19వో ఓవర్లో సింగిల్‌తో మెగా లీగ్‌లోరెండేళ్ల తర్వాత మరో సెంచరీని నమోదుచేశాడు. జితేశ్ (8 నాటౌట్)తో కలిసి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

## రికార్డుస్థాయి కనిష్ఠానికి
# రూపాయి పతనం

మొదటి తరువాయి

డాలర్‌ను ఎగబడి కొనుగోళ్లు జరపడం రూపాయి పతనానికి ఆజ్యంపోశాయని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. కరెన్సీ పతనాన్ని అడ్డుకట్ట వేయడానికి రిజర్వు బ్యాంక్ రంగంలోకి దిగడంతో చివర్లో కోలుకున్నది. 95.52 వద్ద ప్రారంభమైన డాలర్, రూపాయి ఎక్స్చేంజ్ రేటు ఇంట్రాడేలో 95.80 కనిష్ఠ స్థాయిని తాకింది.వరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 2 పైసలు పెరిగి 95.66 వద్ద ముగిసింది. మంగళవారం కరెన్సీ విలువ 40 పైసలు కోల్పోయి చారిత్రక కనిష్ఠ స్థాయి 95.68కి పడిపోయిన విషయం తెలిసిందే. ఆసియాలోనే అత్యంత వరస్ట్ పర్ఫార్మెన్స్ మన కరెన్సీదే కావడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కరెన్సీ విలువ 6 శాతం పతనం చెందింది. ఆర్బీఐ జోక్యంతోపాటు దిగుమతుల భారాన్ని తగ్గించుకోవడానికి నరేంద్ర మోదీ సర్కార్ పసిడి, వెండి దిగుమతులపై సుంకాన్ని 16 శాతానికి పెంచడం రూపాయి పతనానికి పరోక్షంగా దోహదం చేసింది. సమీక్ష భవిష్యత్తులో రూపీ విలువ 95.45 నుంచి 96.15 మధ్యలో పడిపోవచ్చునని ఫారెక్స్ డీలర్ అంచనావేస్తున్నారు.

# లుక్ అవుట్.. నోటీసులివ్వండి

మొదటి తరువాయి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్న వేదికను ఆయన పంచుకోవడం శోచనీయమన్నారు. కుటుంబ సభ్యులపై ఆ స్థాయి ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన ఆ సమావేశానికి వెళ్లాల్సింది కాదన్నారు. దీనివల్ల పెద్దవాళ్ల పిల్లలు ఏ తప్పు చేసినా చూడనట్లు వ్యవహరిస్తారనే భావన ప్రజల్లోకి వెళ్లిందన్నారు.

**దేశం దాటించడం బీజేపీ నైజం**

ఏ ఆరోపణలు వచ్చినా సరే తొలుత నిందితులను దేశం దాటించడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. అందుకే బండి సంజయ్ కుమారుడు దేశం దాటి వెళ్లకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని మరోసారి చెప్పారు. అప్పుడు మాత్రమే విచారణ పారదర్శకంగా జరుగుతుందని విశ్వాసం ప్రజలకు వస్తుందన్నారు.

**బీఆర్ఎస్ వల్లే ఫోటోలు బయటకు..**

కొన్ని పార్టీల వాళ్లు ఒక ట్వీట్ వేసి సమస్యను పరిష్కరించినట్లు చెబుతున్నారని అన్నారు. తాను ఎందుకు స్పందించడం లేదంటూ నానా హంగామా చేస్తున్నారని, ఒక ఆడపిల్ల అంశం వచ్చినప్పుడు చాలా సంయమనంగా వ్యవహరించాలన్నారు. అందులోనూ అమ్మాయి మైనర్ అయినప్పుడు ఇంకా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సమాజం మగపిల్లలను క్షమిస్తుందని, కానీ ఆడపిల్లలను క్షమించదన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహం కారణంగా బాధితురాలి ఫోటోలు బయటకు వచ్చాయన్నారు. దీని కారణంగా ఆ అమ్మాయి జీవితం నష్టపోయే ప్రమాదం ఉందని, పోస్ట్ చేసిన ఖాతాలను గుర్తించి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము ఎప్పుడూ ఆడపిల్లలకు అండగా ఉంటామన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సర్పంచులు చురుకైన పాత్ర పోషించాలి

**- డా. అశ్విని తనాజీ వాఖడే**

**గంగాధర, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చొప్పదండి నియోజకవర్గంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా జరుగుతున్న విద్యా వారోత్సవాల్లో సర్పంచుల కోసం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏసీలబ్ ఉ డీఈవో కరీంనగర్ డా. అశ్విని తనాజీ వాఖడే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సర్పంచులు చురుకైన పాత్ర పోషించాలని, తాను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐఏఎస్ అధికారిగా ఎదిగానని ఉదాహరణగా చెప్పి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని




పిలుపునిచ్చారు. వడ్లూరి సరిత ప్రభుత్వ పాఠశాలల్లో ల్యాబ్‌లు, డిజిటల్ విద్యా సదుపాయాల అభివృద్ధికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందని తెలిపారు. వి. నర్సింగా రావు "మన బడి మన బాధ్యత" అని పేర్కొన్నారు. అజయ్ ప్రైవేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా వార్షికోత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఎంఈఓ ఏనుగు ప్రభాకర్ రావు డిజిటల్ తరగతి గదులు, నాణ్యమైన బోధన విధానాలను చూపిస్తూ ప్రేరణాత్మక వీడియో ప్రదర్శించారు. కొండాయిపల్లి సర్పంచ్ వినయ్ తమ గ్రామ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 17 నుండి 85కి పెంచిన విజయాన్ని వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో చొప్పదండి నియోజకవర్గంలోని పాఠశాలల ప్రస్తుత నమోదు వివరాలు, మౌలిక వసతులు, 2026--27 విద్యా సంవత్సరానికి లక్ష్యాలు వివరించబడ్డాయి. చివరగా విద్యాశాఖ తరఫున వడ్లూరి సరితను ఘనంగా సన్మానించారు. సర్పంచుల ఐక్య సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది.

## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

**- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**



**రామడుగు, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రామడుగు మండలం వెలిచాల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి మిల్లులకు త్వరితగతిన తరలించాలని సూచించారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తోందని, ప్రతి గింజను కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నర్సింగరావు, రామడుగు తహసీల్దార్ రాజేశ్వరి, సహకార సంఘం ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. రైతుల పక్షాన నిలిచి ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

## మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకై ప్రత్యేక సమావేశం




**హుస్నాబాద్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు పాల్గొన్న ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఓటింగ్ నిర్వహించారు. జనరల్ కేటగిరీలో పున్న లావణ్య, భూక్యా సరోజన, మైనార్టీ విభాగంలో మహమ్మద్ హసన్ లాల్ కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. మరో స్థానంపై భిన్నాభిప్రాయాల కారణంగా ఎన్నిక పెండింగ్‌లో కొనసాగుతోంది. ఎన్నికైన సభ్యులకు మున్సిపల్ కమిషనర్ ప్రమాణ స్వీకారం చేయించగా, అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక విజయవంతంగా పూర్తైందని, ఒక స్థానం ఖాళీగా ఉన్నప్పటికీ ఏకాభిప్రాయం కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు హుస్నాబాద్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచిస్తూ, నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి స్పష్టం చేశారు. కౌన్సిలర్ల సహకారానికి ధన్యవాదాలు తెలుపుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, కొత్త ఇళ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులు కౌన్సిలర్లతో సమన్వయంతో పనిచేస్తూ ప్రజా అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగించాలి

**- కలెక్టర్ కె. హైమావతి**



**సిద్ధిపేట, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి, సంగునూరు మండలం ముంద్రాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, ఏఎంసీలలో మక్కల కొనుగోలు కూడా వేగంగా జరుగుతోందని తెలిపారు. తేమ శాతం సక్రమంగా ఉండి లిఫ్టింగ్‌కు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని లారీలు వచ్చే వరకు నిరీక్షించకుండా స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్లు లేదా ఇతర వాహనాల ద్వారా వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. టెంట్లు, తాగునీటి కుండలు, తాలు తీసే యంత్రాలు, వేయింగ్ మిషన్లు, టార్పాలిన్ కవర్లు, సుత్తి దారాలు, గన్నీ బ్యాగులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని, మిల్లుల్లో దిగుమతిలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గింజను వేగంగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు.

## నూతన చెరువు అభివృద్ధి పనుల పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్‌లో నూతన చెరువు కట్ట సుందరీకరణ, తూము అభివృద్ధి పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. కట్ట వెడల్పు పూర్తయిన తర్వాత దశల వారీగా సీసీ పనులు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. కొత్త చెరువు కట్ట లింక్ రోడ్డును సిద్ధిపేట జాతీయ రహదారి లింక్ నుండి హుస్నాబాద్--కరీంనగర్ ఔటర్ రోడ్డుగా ఉపయోగించవచ్చని సూచించారు. హుస్నాబాద్ పట్టణ అభివృద్ధిలో కొత్త చెరువు కట్ట కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై వెలిచాల రాజేందర్ రావు తీవ్ర విమర్శలు



**కరీంనగర్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గత మూడు సంవత్సరాల్లో రెండోసారి నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటన వెలుగులోకి రావడం దేశ విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు తీవ్రంగా విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే డబుల్ సార్లు నీట్ పేపర్ లీకులేనా అని ప్రశ్నిస్తూ, ప్రధాని నరేంద్ర మోడీ వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులు, కోట్లాది కుటుంబాలు ఆందోళన చెందుతున్న పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం ఎలా సమర్థించుకుంటుందో అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో, పరీక్షా నిర్వహణలో భద్రతా లోపాలు, అవినీతి, నిర్లక్ష్యం కారణంగా వారి ఆశలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. అత్యంత కీలకమైన ప్రవేశ పరీక్షలను కూడా పారదర్శకంగా నిర్వహించలేని పరిస్థితి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని రాజేందర్ రావు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న వారికి ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఇంటింటా జనగణన సర్వే

**గంగాధర, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని కురిక్యాల, మధురానగర్ గ్రామాల్లో ఈరోజు



ఇంటింటా జనగణన సర్వే నిర్వహించారు. సర్వే అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి యజమాని పేరు, గదుల సంఖ్య, కుటుంబ సభ్యుల సంఖ్య, మంచినీటి సౌకర్యం, జిపి కనెక్షన్, మరుగుదొడ్డి, వాహనాలు, టీవీ, ఇంటర్నెట్ కనెక్షన్ వంటి వివరాలను నమోదు చేశారు. మండల తహసీల్దార్ అంబటి రజిత మాట్లాడుతూ, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డు వంటి వ్యక్తిగత వివరాలు సర్వే అధికారులకు ఇవ్వకూడదని, అలాగే ఓటీపీ కూడా తెలియజేయరాదని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఎస్‌ఓ చెన్నయ్య, ఆర్‌ఐ సంతోష్ కుమార్, జీపీవో నవీన్‌తో పాటు సర్వే అధికారులు పాల్గొన్నారు. జనగణనలో ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏఈడీపీ కోర్సులపై అవగాహన సదస్సు




**కరీంనగర్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 100 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవం మూడవ రోజు కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సర్పంచులు, కార్పొరేటర్లు, విద్యాశాఖ అధికారులకు ప్రత్యేక అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి ముఖ్య వక్తగా పాల్గొని ఏఈడీపీ కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. సాధారణ డిగ్రీతో పాటు నైపుణ్యాభివృద్ధి అవసరమని, ఈ కోర్సులు విద్యార్థులకు చదువుతో పాటు పరిశ్రమల్లో ప్రాక్టికల్ శిక్షణ, స్టైఫండ్ అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్యపై ఆసక్తి పెంచుకుని ఈ అవకాశాలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. సర్పంచులు, కార్పొరేటర్లు గ్రామస్థాయిలో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పొందేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. కళాశాలలో అందుబాటులో ఉన్న బి.ఏ., బి.కాం., బి.ఎస్సి.తో పాటు హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి ప్రత్యేక ఏఈడీపీ కోర్సులు, ఆధునిక ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, హాస్టల్ వసతి, పోటీ పరీక్షల శిక్షణ, ప్లేస్‌మెంట్ సదుపాయాల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నరేందర్ రెడ్డి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్, వివిధ మండలాల ఎంఈఓలు, సర్పంచులు, కార్పొరేటర్లు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఏఈడీపీ కోర్సులు విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించే కొత్త మార్గం అని ప్రిన్సిపాల్ వరలక్ష్మి స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుల కులగణన సర్వే వేతనాలు చెల్లించాలని తపస్ డిమాండ్




**కరీంనగర్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
2024 నవంబర్--డిసెంబర్ నెలల్లో నిర్వహించిన కులగణన సీఈపీసీ సర్వేలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఇప్పటికీ గౌరవ వేతనం చెల్లించకపోవడం శోచనీయమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కరీంనగర్ జిల్లా శాఖ విమర్శించింది. జిల్లా అధ్యక్షులు అన్నమనేని తిరుపతిరావు, కార్యదర్శి రాచకొండ పవన్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. గత 18 నెలలుగా వేతనం కోసం కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో 2027 జనగణన విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు నిరుత్సాహానికి లోనవుతున్నారని, గౌరవ వేతనం వస్తుందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తపస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కులగణన సర్వే వేతనాలు చెల్లించి, ఉపాధ్యాయులు ఉత్సాహంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని తపస్ కరీంనగర్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ చిత్రా మిశ్రా



**తిమ్మాపూర్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తిమ్మాపూర్ మండలం రేణిగుంట పరిధిలోని శ్రీ సాయి శ్రీనివాస, ఆర్.కే రైస్ మిల్లులను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. సేకరించిన ధాన్యం మిల్లుల్లో త్వరత్వరగా దింపుకోవాలని, కొనుగోళ్ల వేగం పెంచాలని ఆమె ఆదేశించారు. మిల్లర్లు, రవాణాదారులు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హమాలీలను, వాహనాలను మరింతగా సిద్ధం చేసుకోవాలని, అన్‌లోడింగ్ విషయంలో ఎలాంటి కొర్రీలు విధించరాదని హెచ్చరించారు. సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులకు తెలియజేయాలని, జిల్లా యంత్రాంగం పరిష్కారానికి సిద్ధంగా ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. అదనంగా సైదాపూర్ మండలంలోని వెంకిపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం, దుద్దెనపల్లి వరి కొనుగోలు కేంద్రాలను కూడా ఆమె పరిశీలించారు. రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, హమాలి--రవాణా సమస్యలను అధిగమించాలని సెంటర్ ఇన్‌చార్జీలకు ఆదేశించారు. ఈ సందర్శనలో ఆర్డీఓ మహేశ్వర్, పౌర సరఫరాల సంస్థ డీఎం రజనీకాంత్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి గింజను వేగంగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు





**పాలకుర్తి, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం కన్నాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు జరిగింది. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏప్రిల్ 27 నుండి మే 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జగిత్యాల పొలాస వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ టి. ఎల్లా గౌడ్ రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. యూరియా, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పంట వైవిధ్యీకరణ పాటించాలని, భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన రకాలను సాగు చేస్తే మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ లభిస్తుందని తెలిపారు. వానాకాలం సాగులో నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ బండి ప్రమోద్ కుమార్, ఏఈఓ బి. శశిధర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించి స్థిరమైన ఆదాయం పొందగలరని నిపుణులు స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ చిత్రా మిశ్రా



**జమ్మికుంట, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బుధవారం జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో హాజరు, ఒపీ, ఐపి రిజిస్టర్లు, ల్యాబ్, డ్రెస్సింగ్ రూమ్, మహిళా--పురుషుల వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి, వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణీలు క్రమం తప్పకుండా టీకాలు తీసుకునేలా చూడాలని, సాధారణ ప్రసవాలకు వారిని మానసికంగా సిద్ధం చేయాలని చెప్పారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని సౌకర్యాలను వినియోగించాలని, ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బందికి రక్షణ కవచాలు అందించాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో తహసిల్దార్ వెంకటరెడ్డి, మెడికల్ ఆఫీసర్ సంపత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఘనంగా పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం

**కరీంనగర్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంకమ్మతోటలోని టీఎన్జీవో కమ్యూనిటీ హాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. జిల్లాలోని వివిధ మండలాల నుంచి దాదాపు 200 మంది కార్యదర్శులు హాజరై తమ సమస్యలు, విధుల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పరిపాలనా ఒత్తిళ్లు, న్యాయపరమైన అంశాలను జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ దృష్టికి తీసుకువచ్చారు. దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరవేసేది పంచాయతీ కార్యదర్శులేనని, బర్త్ సర్టిఫికేట్ నుంచి డెత్ సర్టిఫికేట్ వరకు, త్రాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, పల్లె ప్రకృతి వనం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో ప్రజల ప్రాణాల రక్షణ కోసం కార్యదర్శులు అహర్నిశలు కష్టపడ్డారని గుర్తుచేశారు.



జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ మాట్లాడుతూ "పంచాయతీ సెక్రటరీ అని పిలిపించుకోవడం గర్వకారణం" అని పేర్కొన్నారు. కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుంటున్నామని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సూడా అనుమతులు, ప్రొబేషన్, రెగ్యులరైజేషన్, ట్యాక్స్ కలెక్షన్, పీడీ అకౌంట్ వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి నెల నాలుగో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఒల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, టీఎన్జీవో కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు రాజేష్ భరద్వాజ్, సుస్మిత, గోదావరి అజయ్, రాకేష్, రేవంత్ రెడ్డి, కిరణ్ వాహజ్, మధుమిత, కార్తీక్, మహేందర్ రావు తదితర ఉద్యోగ సంఘ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ పరిపాలనలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని, వారికి అండగా ఉంటామని అధికారులు స్పష్టం చేశారు.

# బండి సంజయ్ను మంత్రి పదవి నుంచి తొలగించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ డిమాండ్

**కరీంనగర్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మైనర్ బాలికపై అత్యాచార కేసులో బండి సాయి భగీరథ్‌ను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, అలాగే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మంత్రి పదవి నుండి తొలగించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్ష పద్మ, ప్రధాన కార్యదర్శి అంజలి డిమాండ్ చేశారు. బుధవారం కమాన్ చౌరస్తా వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళలపై బీజేపీ నేతల అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులు మహిళలపై, మైనర్ బాలికలపై అత్యాచారాలు, హత్యలు




చేస్తున్నారని ఆరోపించారు. బండి సంజయ్ కుమార్ కుమారుడు సాయి భగీరథ్‌పై ఆరు రోజుల క్రితం ఫోక్సో కేసు నమోదైనప్పటికీ ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడం సభ్యసమాజం తలదించుకునే పరిస్థితి అని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేసు నమోదైనప్పటికీ చూసి చూడనట్లు వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు అఖిల, సహాయ కార్యదర్శి సావిత్రి, నాయకురాళ్లు రజిత, సంధ్య, రాధ, ముని, సరోజన, భాగ్య, చంద్రకళ, పుష్ప తదితరులు పాల్గొన్నారు. మహిళల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని మహిళా సమాఖ్య స్పష్టం చేసింది.

# ముంపు భూముల్లో పండిన వరి కొనుగోలు చేయాలని రైతుల వినతి

**తిమ్మాపూర్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎల్ఎండి రిజర్వాయర్ పరిధిలో ముంపుకు గురైన భూముల్లో ఒక సీజన్ వ్యవసాయం చేసుకుంటూ పండించిన వరి పంటను కొనుగోలు చేయాలని రామకృష్ణకాలనీ గ్రామానికి చెందిన రైతులు తిమ్మాపూర్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. సుమారు 70 మందికి పైగా రైతులు గత 25 ఏళ్లుగా ఈ భూముల్లో పంటలు పండించి అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, కానీ స్థానిక కొనుగోలు కేంద్రాలు ఈ ధాన్యాన్ని స్వీకరించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల వెంట వచ్చిన బీజేపీ నాయకులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి ఈ




సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. వ్యవసాయం తప్ప వేరే పనులు తెలియని ఈ రైతులు మానవతా దృక్పథంతో పండించిన పంటను కొనుగోలు చేయాలని కోరారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో రైతు ధ్రువీకరణ పత్రం ఆధారంగా వ్యవసాయ అధికారుల అనుమతితో కొనుగోలు చేసినట్లు గుర్తుచేశారు. రైతులు గోనెల భూమయ్య, గంగు రాజమల్లు, కోతి మల్లేశం, ఆవుల లచ్చయ్య, గంగు తిరుపతి, అట్ల అంజయ్య తదితరులు తహసీల్దార్‌ను కలసి సమస్య పరిష్కారం కోరారు. వారి వెంట బీజేపీ నాయకులు గడ్డం అరుణ్, కోతి రాజు ఉన్నారు. తహసీల్దార్ ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ముంపు భూముల్లో పండిన వరి పంటను కొనుగోలు చేయాలని రైతులు పట్టుదలతో విజ్ఞప్తి చేశారు.

# అమ్రాబాద్ మండలానికి నూతన తహసీల్దార్‌గా వెంకటేశ్వర రెడ్డి బాధ్యతలు స్వీకరించారు



**అమ్రాబాద్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలానికి కొత్త తహసీల్దార్‌గా వెంకటేశ్వర రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి మండల సమస్యలను వివరిస్తూ స్థానికులు కలుసుకున్నారు. రైతుల సమస్యల కోసం నేరుగా తనను సంప్రదించాలని, బినామీలను నమ్మి మోసపోకూడదని తహసీల్దార్ సూచించారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నందున సాధ్యమైనంత వరకు ఇంట్లోనే ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంఏ రహీం, సర్పంచ్ చిగుర్ల కోటయ్య, హరి నారాయణ గౌడ్, గోలి మల్లేష్, తిరుపతయ్య, కోరే రేనయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. అమ్రాబాద్ మండల ప్రజలకు సమస్యల పరిష్కారంలో తహసీల్దార్ అండగా ఉంటానని వెంకటేశ్వర రెడ్డి హామీ ఇచ్చారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

**గంగాధర, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని పెండలోనిపల్లి గ్రామంలో తాళం వేసిన ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పిర్యాదుదారురాలు ముత్యాల హేమలత తెలిపిన వివరాల ప్రకారం, మే 11 ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లి, మే 13 ఉదయం తిరిగి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి



బీరువాలను పగులగొట్టి అందులో భద్రపరిచిన సుమారు 30 తులాల వెండి కడియాలు, 5 గ్రాముల బంగారం, నగదు రూ.7,000/-లను దొంగలించినట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, క్లూస్ టీమ్ సహాయంతో సంఘటన స్థలంలో వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. తాళం వేసిన ఇంట్లో జరిగిన ఈ చోరీతో గ్రామంలో ఆందోళన నెలకొంది.

# వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**పెద్దపల్లి, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ గడ్డం వంశీకృష్ణ సందర్శించి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ధాన్యం తూకం విధానం, కొనుగోలు ప్రక్రియ, నిల్వ సౌకర్యాలపై రైతులు వ్యక్తం చేసిన ఇబ్బందులను ఆయన పరిశీలించారు. జిల్లా మార్కెటింగ్ అధికారితో మాట్లాడి రైతుల సమస్యలను పట్టించుకోకపోవడంపై నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోందో ఆరా తీశారు.మార్కెట్ యార్డులో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, పారదర్శక తూకం విధానం అమలు చేయాలని, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంపీ సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రైతులకు న్యాయం జరగడం తన ప్రాధాన్యత అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# పుట్నూరులో దారుణ హత్య

### - మహిళ మృతి



**పాలకుర్తి, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం బసంతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పుట్నూరు గ్రామ ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి బౌతు సుమలత (36) అనే మహిళ దారుణ హత్యకు గురైంది. బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం, అవివాహిత అయిన సుమలత గత కొన్నేళ్లుగా గ్రామంలో మేకలు కాస్తూ జీవనం కొనసాగిస్తోందని, తల్లి మరణించగా పక్షవాతం వచ్చిన తండ్రితో కలిసి ఉంటోందని తెలిపారు. మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసి ఆమెను హత్య చేసినట్లు చెప్పారు. బుధవారం ఉదయం గ్రామస్తులు ఈ ఘటనను గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గోదావరిఖనిలో నివాసం ఉండే మృతురాలి అన్నయ్య బౌతు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు, అదే గ్రామానికి చెందిన వేల్పుల స్వామి కొంతకాలంగా సుమలతను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని వేధిస్తున్నాడని, ఈ హత్యకు అతడే కారణమని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని హత్య జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.గ్రామంలో జరిగిన ఈ దారుణ హత్యతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

# ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం



**అమ్రాబాద్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎంఎ రహీం, సర్పంచ్ చిగుర్ల కోటయ్య, ఉమామహేశ్వర డైరెక్టర్ తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబా, గోలి మల్లేష్, కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా కళాశాలలో రెండో విడత రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. మే 15 నుంచి మే 25 వరకు వెబ్ ఆప్షన్లు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థుల సన్మానం విద్యా వారోత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# బోడుప్పల్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక




**బోడుప్పల్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాజీవ్ నగర్ కాలనీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం తడి చెత్త--పొడి చెత్త అవగాహన కార్యక్రమం జరిగింది.ముఖ్య అతిథిగా విచ్చేసిన సానిటరీ అధికారి డీ.ఈ. జాహ్నవి మాట్లాడుతూ, "చెత్త ఆటోలు వచ్చినప్పుడు గ్రీన్ బాకెట్‌లో తడి చెత్త, బ్లూ బాకెట్‌లో పొడి చెత్త, రెడ్ బాకెట్‌లో డైపర్లు--పాడ్స్, బ్లాక్ బాకెట్‌లో సిరంజీలు, గ్లాస్ ముక్కలు, డేట్ అయిపోయిన మందులు వేయాలి. పరిసరాలు శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని సూచించారు.దోమల నివారణకు పాగింగ్ చర్యలు చేపడుతున్నామని, రోడ్డు పక్కన చెత్త వేసే వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సానిటరీ వార్డు ఆఫీసర్ జాడిగే శ్రీను, హెల్త్ అసిస్టెంట్ వినోద్, డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు, సానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

# రవీంద్ర భారతిలో దివ్యాంగుల 'ఆట పాట" కార్యక్రమం



**హైదరాబాద్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మే చివరి వారంలో రవీంద్ర భారతిలో జరగబోయే దివ్యాంగుల "ఆట పాట" కార్యక్రమానికి అనుమతి కోరుతూ, తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్, జానపద కళాకారుడు జానయ్య బుధవారం రవీంద్ర భారతి సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డిని కలిశారు.ఈ సందర్భంగా గుత్తికొండ కిరణ్ మాట్లాడుతూ, "దివ్యాంగుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. సంచాలకుడు సానుకూలంగా స్పందించారు" అని తెలిపారు.

# శ్రీ భక్తాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు



**ముప్పిరితోట ఆంజనేయ స్వామి ఆలయంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు దుగ్యాల సంతోష్ రావు**

**ఎలిగేడు, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ముప్పిరి తోట గ్రామంలోని నూతన ఆలయంలో శ్రీ భక్తాంజనేయ దివ్య విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.
ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు దుగ్యాల సంతోష్ రావు బుధవారం స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. "మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి" అని ఆయన ఆకాంక్షించారు.తరువాత ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం..

### - డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సభ్యులకు ఘన సన్మానం




**ఆమనగల్లు, మే 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని భవిష్యత్‌లో మరింతగా సేవలు విస్తృతం చేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీపాద శర్వాణి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల 99 రోజుల కార్యచరణలో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలో విద్యా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీపాద శర్వాణి, వైస్ చైర్మన్ జగదీష్వర్ రెడ్డి బృందం ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ బి. యాదయ్య, క్లబ్ సభ్యులు ఉప్పల రాములు, రామ్మోహన్, పిఆర్ఓ పాష లను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లెక్చరర్స్ బాయి, జె హరీష్, శ్రీవాణి తదితరులు ఉన్నారు.

# రోటరీ క్లబ్ సమక్షంలో పలు సేవా కార్యక్రమాలు



**కరీంనగర్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి లక్షల రూపాయల విలువైన పరికరాలు అందజేశారు. ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన సీ-ఆర్మ్ ఎక్స్‌రే యంత్రం, శస్త్రచికిత్సలకు ఉపయోగపడే పరికరాలు, అంబులెన్స్‌ను అందజేశారు.దాదాపు 36 లక్షల రూపాయల విలువైన ఈ పరికరాలు రోటర్ ఫౌండేషన్ గ్లోబల్ గ్రాంట్ కార్యక్రమం క్రింద అమలు చేయబడ్డాయి. అమెరికాలోని కాలిఫోర్నియా లివర్ మోర్ రోటరీ క్లబ్ మద్దతు అందించింది. రోటరీ మాజీ జిల్లా గవర్నర్ ఆనంద్ నాయకత్వంలో ఈ ప్రాజెక్టు పూర్తయింది.ఈ కార్యక్రమంలో రోటరీ జిల్లా 3150 ఫౌండేషన్ చైర్మన్ ప్రభాకర్, మాజీ గవర్నర్ రమేష్ వంగల, లివర్ మోర్ రోటరీ మాజీ సెక్రటరీ బీవీరావు, జిల్లా గవర్నర్ రాంప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి పాల్గొన్నారు. అదనంగా అసిస్టెంట్ గవర్నర్ వెంకటకిషన్, జిల్లా అధ్యక్షులు చీటి రామారావు, సెక్రటరీ పవన్ క్రిష్ట, క్లబ్ సర్వీస్ ప్రాజెక్ట్స్ చైర్మన్ రాంమోహన్ రావు, తిప్పారపు ఆంజనేయులు, ఇతర జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు హాజరయ్యారు.ప్రభుత్వ ఆసుపత్రికి 36 లక్షల విలువైన పరికరాలు, అంబులెన్స్ అందజేయడం ద్వారా రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాల్లో మరో మైలురాయిని చేరుకుంది.

# ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని రైతుల వినతి



**పెద్దపల్లి, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణం 9వ వార్డు, చైతన్య కాలనీ రోడ్ నంబర్ 1 మరియు రోడ్ నంబర్ 2లో ప్రమాదకరంగా వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని స్థానికులు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పించారు.బొల్లం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని చేరుకున్న కాలనీ వాసులు, వేసవి కాలంలో అకస్మాత్తుగా వచ్చే ఈదురు గాలులు, వడగళ్ల వానల వల్ల స్తంభాలు కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రాణనష్టం జరగకముందే అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.కాలనీ ప్రజలు విద్యుత్ శాఖ వెంటనే స్పందించి ప్రమాదకర స్తంభాలను సరిచేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



**పెద్దపల్లి, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించేందుకు ఆలయాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్ రావు, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ముప్పిరితోట గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ఇబ్రహింపట్నం లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం ప్రారంభం



**రంగారెడ్డి, మే 13( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....విద్య ద్వారానే జీవితాల్లో వెలుగులు నిడుతాయని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అనంతరెడ్డి, తోపాటు అధికారు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ బైపాస్‌లో ప్రమాదం..!



**షాద్‌నగర్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేశంపేట్ చౌరస్తా వద్ద బుధవారం ఉదయం భారీ ప్రమాదం తృటిలో తప్పింది. హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ లారీ ఉదయం 10:30 గంటల సమయంలో అదుపు తప్పి ముందుగా ఓ కారును ఢీకొట్టి, అనంతరం డివైడర్‌ను ఢీకొట్టి, అక్కడే ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఐస్‌క్రీమ్ విక్రయానికి వచ్చిన బైక్ సహా మరో ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది. కొంతమంది గాయపడినప్పటికీ ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది. ప్రత్యక్ష సాక్షులు "లారీ వేగం మరింత ఎక్కువగా ఉండి ఉంటే పెద్ద విషాదం జరిగేది" అని తెలిపారు. స్థానికులు గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం తరలించారు. ప్రమాదంతో కొంతసేపు బైపాస్ రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు, "కేశంపేట్ బైపాస్ ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగుతుండటంతో ట్రాఫిక్ ఒత్తిడి పెరిగి ప్రమాదాలు అధికమవుతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించేందుకు ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# జగన్ రఫీని పరామర్శించిన డా. దారా



**నందికొట్కూరు, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు పట్టణానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ కార్యకర్త జగన్ రఫీ భార్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పార్టీ సమన్వయకర్త డా. దారా సుధీర్, పట్టణ అధ్యక్షుడు మన్సూర్తో కలిసి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా "మీ కుటుంబానికి వైఎస్ఆర్సిపి పార్టీ అండదండలు ఉంటాయి" అని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణంలోని ముఖ్య వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రఫీ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

# ఎద్దుల బలప్రదర్శన ప్రారంభించిన ఎమ్మెల్యే



**నందికొట్కూరు, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హనుమాన్ జయంతి సందర్భంగా జూపాడుబంగ్లా మండలం కనకయ్య కొట్టాల గ్రామంలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాష్ట్ర స్థాయి ఆరువంట ఎద్దుల బలప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఇంటి నిర్మాణానికి 'కౌన్సిలర్ పాపిశెట్టి రాము' చేయూత



**ఆమనగల్లు, మే 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకు చెందిన వంకేశ్వరం తిమ్మయ్య ఇంటి నిర్మాణానికి ప్రముఖ సంఘ సేవకులు, ఆవార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము చేయూతనందించారు. తిమ్మయ్య ఇంటి నిర్మాణానికి సిమెంట్ బ్యాగులను బుధవారం నాయకులు జంతుక కిరణ్, చలిచీమల సతీష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీలో పేదలను ఆదుకోవడమే పాపిశెట్టి రాము లక్ష్యమని తెలిపారు. గూడు లేని నిరుపేదలకు చెందిన ఇండ్ల నిర్మాణానికి ఆదుకుంటున్నామని పేర్కొన్నారు.

## మనుషులలో బలహీనపడుతున్న
# మానవ విలువల

ప్రస్తుత సమాజంలో మనుషుల మధ్య అనుబంధాలు, ఆప్యాయత, పరస్పర గౌరవం వంటి విలువలు క్రమంగా బలహీనపడిపోతున్నాయి. ఒకప్పుడు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సంతోషాలు--కష్టాలను పంచుకుంటూ ఒకరికొకరు తోడుగా నిలిచేవారు. కానీ నేటి కాలంలో స్వార్థం, డబ్బు, వ్యక్తిగత ప్రయోజనాలే ప్రధానమవుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ప్రపంచం దగ్గరైనట్టే కనిపిస్తున్నా, మనుషుల మనసులు మాత్రం దూరమవుతున్నాయి. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా కారణంగా ప్రత్యక్ష సంభాషణలు తగ్గిపోవడం, ఇంట్లో ఒకే చోట ఉన్నా ప్రతి ఒక్కరూ తమ తమ ఫోన్లలో మునిగిపోవడం కుటుంబ అనుబంధాలను బలహీనపరుస్తోంది. సమాజంలో సహనం తగ్గిపోవడం, చిన్న విషయాలకే గొడవలు, ద్వేషాలు, హింస పెరగడం ఆందోళన కలిగించే పరిణామం. పెద్దలను గౌరవించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం వంటి




విలువలు కనుమరుగవుతున్నాయి. విద్యా వ్యవస్థలో కూడా నైతిక విలువలకు తగిన ప్రాధాన్యం తగ్గిపోవడంతో విద్యార్థులు మార్కులు, ఉద్యోగాల పోటీపై మాత్రమే దృష్టి పెట్టి మానవత్వాన్ని మరిచిపోతున్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే ప్రేమ, గౌరవం, సహనం, సేవాభావం వంటి విలువలను నేర్పించడం అత్యవసరం. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి పనిచేస్తేనే మానవ విలువలు బలపడతాయి. డబ్బు కంటే మనుషులే ముఖ్యమని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మనుషుల మధ్య విలువలు బలహీనపడటం సమాజానికి మంచిది కాదు. మానవత్వం, ప్రేమ, గౌరవం నిలబడినప్పుడే సమాజం సుస్థిరంగా ఉంటుంది. అందుకే ప్రతి వ్యక్తి మంచి ఆలోచనలతో, మంచి మనసుతో జీవిస్తూ మానవ విలువలను కాపాడాలి.


**వ్యాసకర్త**

వేల్పుల మహేందర్
ఎంఎస్సీ, ఏంఏ, ఏంఈడి
అధ్యాపకులు




# పార్కు స్థలాల ఆక్రమణలపై స్థానికుల నిరసన

**బడంగ్పేట్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బడంగ్పేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో ప్రజల వినోదం, పిల్లల ఆటలు, వయోవృద్ధుల నడక, వ్యాయామం మరియు పర్యావరణ పరిరక్షణ కోసం కేటాయించిన పార్కు స్థలాలు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణలపై స్థానిక ప్రజలు, బీజేపీ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 61వ డివిజన్ దేవతాళగుట్ట పరిధిలోని సర్వే నంబర్ 75/1లో సుమారు 1600 గజాల పార్కు స్థలం ఫేక్ సంతకాలు, ఫోర్జరీ డాక్యుమెంట్లతో కబ్జాకు గురైందని వారు ఆరోపించారు. ప్రస్తుతం ఈ స్థలం మార్కెట్ విలువ రూ. 4.80 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన ఈ స్థలాలు అక్రమంగా ఆక్రమించబడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. గత పాలకవర్గం హయాంలో అధికార దుర్వినియోగం కారణంగానే ఇలాంటి ఆక్రమణలు జరిగాయని, అప్పటి మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్ నిర్లక్ష్యం వహించారని స్థానికులు విమర్శించారు. అదేవిధంగా 61వ డివిజన్ ఏఆర్సిఐ కంపెనీ ఉత్తరం వైపున వినాయక నగర్ కాలనీ సర్వే



నంబర్ 43లోని 630 గజాల పార్కు స్థలం, అందులోని సెప్టిక్ ట్యాంక్‌తో సహా ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని కాలనీవాసులు తెలిపారు. సుల్తాన్పూర్ సర్వే నంబర్లు 62, 63లోని 835 గజాల పార్కు స్థలంలో కొంతభాగాన్ని రెండు ప్లాట్లుగా విభజించి విక్రయించారని భూయజమాని ఎన్ను యాదిరెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో బడంగ్పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంటనే సమగ్ర విచారణ జరిపి సంబంధిత పార్కు స్థలాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, మున్సిపల్ బోర్డులు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిహెచ్ఎంసి కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ఇన్‌చార్జ్ పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రావుల మల్లేష్, మాజీ కార్పొరేటర్ తోట శ్రీధర్ రెడ్డి, ఎ. సైదులు, నవారి శ్రీనివాస్ రెడ్డి, ఎం. ప్రవీణ్ గౌడ్, గుండె నాగార్జున, శ్రీకాంత్ గౌడ్, జి. మల్లేష్, కళ్లెం లక్ష్మారెడ్డి, భరత్ ముదిరాజ్, రామాచారి, కళ్లెం మురళీధర్ రెడ్డి, సిహెచ్. ఆంజనేయులు ముదిరాజ్, ఎన్ను యాదిరెడ్డి, గండికోట అంజయ్య, ఎ. శంకరమోహన్, శివ ముదిరాజ్, మహిళా నాయకులు కావ్య, పద్మజ, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు. పార్కు స్థలాలను ప్రజల కోసం కాపాడి అభివృద్ధి చేయాలని స్థానికులు పట్టుదలతో డిమాండ్ చేస్తున్నారు.

# చివరి గింజ వరకు కొంటాం..

- సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్



**ఆమనగల్లు, మే 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో సింగల్ విండో పాలకవర్గంతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల యజమానులు రైతులు ట్రాన్స్ పోర్ట్ వారితో కలిసి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంప వెంకటేష్ మాట్లాడుతూ.. రైతులు మధ్య దళారులను ఆశ్రయించవద్దని ఆయన కోరారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తేమశాతంతో కూడిన వరి ధాన్యాన్ని తీసుకువచ్చి క్వింటాలు కు సన్న రకం మద్దతు ధర రూ, 2389, దొడ్డు రకం రూ. 2369 మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం రూపాయల 500 బోనస్ అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ప్రాథమిక సహకార సంఘం అధికారులను ఆయన ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉన్న తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆమనగల్ సింగల్ విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, ప్రాథమిక సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్టర్ బి. ఆంజనేయులు, సీనియర్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్, సీఈవో పద్మాకర్ రెడ్డి, సిబ్బంది దేవేందర్, ఏఈఓ బాలకృష్ణ, మీనాక్షి, రైతులు లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి, గాజుల మల్లయ్య, నాయకులు చలిచీమల సతీష్, జంతుక కిరణ్, జగదీష్ తదితరులు ఉన్నారు.

# విద్యా వారోత్సవాలపై కలెక్టరేట్‌లో సమీక్ష



**ఎలిగేడు, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు, ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎలిగేడు మండలానికి చెందిన సర్పంచులు, విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతుల సమస్యలు, అభివృద్ధి పనులు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై జిల్లా కలెక్టర్ కోయ హర్ష, జిల్లా విద్యాధికారి శారద దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నరేంద్ర చారి, సర్పంచులు కప్పల ప్రవీణ్, మారం కొమురయ్య, కవ్వంపెల్లి బాపయ్య, సిద్ధి తిరుపతి, పల్లెర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం



**మర్రిగూడ, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆవరణలో నిర్మాణం జరుగుతున్న సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, "ఆలయ నిర్మాణం కోసం వస్తువుల రూపంలోనైనా, ధన రూపంలోనైనా సహాయ సహకారాలు అందించాలి. బుధవారం కొండూరు తండా వాసుల వద్ద విరాళాల సేకరణ చేపడుతున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్, కొలుకులపల్లి యాదయ్య, చెరుకు శ్రీరామ్ గౌడ్, నల్ల శేఖర్, నల్ల యాదయ్య, రామ్‌జీ, బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్ నాయక్, ఐతగోని లోకేష్, వి.ఎస్. రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలు చొరవ చూపితే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయి

## - కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో విద్యా వారోత్సవాల సందర్భంగా, పట్టణంలోని డీ.కేఆర్ ఫంక్షన్ హాల్లో ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి హాజరయ్యారు. సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోంది. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు చొరవ చూపితే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయి" అని అన్నారు.ప్రతి గ్రామ సర్పంచ్,



వార్డు సభ్యులు తమ పరిధిలోని పాఠశాలలను తరచూ సందర్శించి హాజరు, బోధన, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాలను పర్యవేక్షించాలని సూచించారు. బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాల మానేసే విద్యార్థుల సంఖ్య తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య అందుతుంది. ప్రైవేట్ పాఠశాలల ఆకర్షణలో పడితే తల్లిదండ్రులు ఆర్థికంగా దెబ్బతింటారు, విద్యార్థుల భవిష్యత్తు కూడా నాశనం అవుతుంది" అని హెచ్చరించారు.జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ తరగతులు, పాఠశాలల ఆధునీకరణ వంటి అంశాలను వివరించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మండల విద్యాధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, వెంకటేశ్వర్ల శెట్టి, సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పార్కు స్థలాల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలి - బీజేపీ

**బడంగ్‌పేట్, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజల వినోదం, పిల్లల ఆటలు, వయోవృద్ధుల నడక, వ్యాయామం, పర్యావరణ పరిరక్షణ కోసం కేటాయించిన పార్కు స్థలాలు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి.61వ డివిజన్ దేవతాళగుట్ట పరిధిలోని సర్వే నంబర్ 75/1లో 1600 గజాల పార్కు స్థలం ఫేక్ సంతకాలు, ఫోర్జరీ డాక్యుమెంట్లతో కబ్జాకు గురైందని స్థానికులు ఆరోపించారు. ప్రస్తుతం ఈ స్థలం మార్కెట్ విలువ రూ.4.80 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు.అదేవిధంగా వినాయక నగర్ కాలనీ సర్వే నంబర్ 43లోని 630 గజాల పార్కు స్థలం, సుల్తాన్పూర్ సర్వే నంబర్లు 62, 63లోని 835 గజాల పార్కు స్థలం కూడా ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.గత



పాలకవర్గం హయాంలో అధికార దుర్వినియోగం, నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఆక్రమణలు జరిగాయని ఆరోపిస్తూ, అప్పటి మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్పై విమర్శలు గుప్పించారు.ఈ నేపథ్యంలో బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంటనే సమగ్ర విచారణ జరిపి, సంబంధిత పార్కు స్థలాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, మున్సిపల్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు.లేనిపక్షంలో జిహెచ్ఎంసి కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ఇంచార్జ్ పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రావుల మల్లేష్, మాజీ కార్పొరేటర్ తోట శ్రీధర్ రెడ్డి, ఎ. సైదులు, నవారి శ్రీనివాస్ రెడ్డి, ఎం. ప్రవీణ్ గౌడ్, గుండె నాగార్జున, శ్రీకాంత్ గౌడ్, జి. మల్లేష్, కళ్లెం లక్ష్మారెడ్డి, భరత్ ముదిరాజ్, రామాచారి, కళ్లెం మురళీధర్ రెడ్డి, సిహెచ్. ఆంజనేయులు ముదిరాజ్, ఎన్ను యాదిరెడ్డి, గండికోట అంజయ్య, ఎ. శంకరమోహన్, శివ ముదిరాజ్, మహిళా నాయకులు కావ్య, పద్మజ, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

# పడమటి తండాలో సమస్యలు లేకుండా చూడడమే లక్ష్యం



**తలకొండపల్లి, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "పడమటి తండాలో ఏ సమస్య లేకుండా చేయడమే నా లక్ష్యం" అని సర్పంచ్ వి. శంకర్ నాయక్ అన్నారు.తాళగుట్ట తండాలో తాగునీటి బోరు రిపేర్ అవసరం ఉన్న విషయం తెలుసుకున్న ఆయన, తన సొంత నిధులతోనే బోరు మరమ్మతు చేసి, స్వయంగా పనులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, స్థానికులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు సర్పంచ్ చొరవను అభినందించారు.

# అదనపు కలెక్టర్‌ను కలిసిన గుజ్జుల మహేష్



**తలకొండపల్లి, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా నూతనంగా నియమితులైన డా. కిరణ్మయి కొప్పుశెట్టి ను తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన బుకేతో శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్‌లో ప్రజా సేవలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**తలకొండపల్లి, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండలంలోని జూలపల్లి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై, కళ్యాణం అనంతరం స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని దర్శనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలకం. గ్రామాల్లో ఐక్యత, శాంతి, భక్తి భావం పెంపొందించడంలో దేవాలయాల పాత్ర ముఖ్యమైనది. ప్రజా సేవతో పాటు ఆధ్యాత్మిక విలువలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు రాఘవేందర్ ముదిరాజ్, అల్లాణి గౌడ్, కడారి పర్వతాలు యాదవ్, భాషామోని సాయికుమార్, సుధాకర్ యాదవ్, సురేష్ గౌడ్, శేఖర్ గౌడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య భద్రతకు సీఎంఆర్‌ఎఫ్



**ఆమనగల్లు, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భద్రత ముఖ్యమంత్రి సహాయ నిధి అని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వెల్దండ మండలం రాఘయిపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ కు సీఎం సహాయ నిధి నుండి గోలీ శ్రీనివాస్ రెడ్డి సహకారంతో రూ. 14 వేల రూపాయలు మంజూరు అయ్యాయి. అట్టి చెక్కును బుధవారం స్థానిక నాయకులతో కలిసి గోలీ శ్రీనివాస్ రెడ్డి బాధితులకు అందజేసి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో తోడ్పాటునందిస్తుందని అన్నారు. ఆరోగ్యశ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం బాధితులకు అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెల్దండా మాజీ జడ్పీటీసీ ద్యాప విజిత రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ పుట్ట రామ్ రెడ్డి, జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జోగాయ్య, రాఘయిపల్లి ఉప సర్పంచ్ కొండల్, వార్డు సభ్యులు ఆనంద్, నరేష్, సీనియర్ నాయకులు నగేష్, రాజు, ప్రవీణ్, సుమన్ నాయక్, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి తండాకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యం

## - సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి
## - తాగునీటి శుద్ధి కేంద్రం ప్రారంభం



**ఆమనగల్లు, మే 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు రక్షిత త్రాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కడ్తాల్ మండలం గానుగుమర్ల తండాలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో రూ. 1.50 లక్షలతో తాండలో త్రాగునీటి శుద్ధి కేంద్రం (వాటర్ ప్లాంట్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తండా ప్రజలు స్వచ్ఛమైన త్రాగునీరు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అపరిశుభ్రమైన నీటి వినియోగం వల్ల అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాలు, తండాల్లో త్రాగునీటి సౌకర్యాలను కల్పిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, సర్పంచ్ బాణావత్ సేవ్యా, ఉప సర్పంచ్ జర్పుల లక్పతి నాయక్, వార్డు సభ్యులు శ్రీను, రాజు, గోపి, రాజు, నాగార్జున, లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్లు గోప్య నాయక్, పాండు నాయక్, సీనియర్ నాయకులు చంద్రు, బధ్య, హిమ్లా, హర్య, పంతు, రూప్ సింగ్, హరిలాల్, గణేష్, బాను, జయేంద్ర, వినోద్, మహేష్, జగన్, రాహుల్ మరియు తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీధి నాటకాలను ప్రోత్సహించాలి

## - కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, మే 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** వీధి నాటకాల కళాకారులను ప్రోత్సహించాలని ప్రముఖ సంఘ సేవకులు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము రెడ్డి అన్నారు. మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ వీధి నాటకానికి మంగళవారం రాత్రి ఆయన హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరించిపోతున్న వీధి నాటకాలను కాపాడుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వీధి నాటకాలను వీక్షిస్తూ వాటిలో ఉన్న సారంశాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం కళాకారులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రామన్న యువసేన నాయకులు శ్రీను నాయక్, పూసల భాస్కర్ మరియు కళాకారులు వెంకటయ్య, జంగయ్య, శేషయ్య, పెద్ద రాములయ్య, పెద్ద యాదయ్య, చిన్న యాదయ్య, పోషయ్య, సాలయ్య, మహేష్ పంతులు రాములయ్య తదితరులు ఉన్నారు.

# 'నీట్' లీకేజీపై విచారణ జరిపించాలి



**ఆమనగల్లు, మే 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేశ వ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ పేపర్ లీకేజీ ఘటన దారుణమని ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడంలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**




**ఆమనగల్లు, మే 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నిరుపేదల సొంతింటి కలను తీర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మండల నార్లకుంట తండా గ్రామ పంచాయతీలో లబ్దిదారు ఆంగోత్ మంజుల రాజు కు గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా బుధవారం గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో దశాబ్ద కాలం తర్వాత నివాసం లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం హర్షనీయమని అన్నారు. గత ప్రభుత్వ పాలకుల నిర్వాకం వల్ల ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తున్నట్లు చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు ఇళ్లు రాలేదని బాధపడాల్సిన అవసరం లేదని, త్వరలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆమన్ గల్ వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, కడ్తాల్ సర్పంచ్ భిక్షపతి, నార్లకుంట తండా ఉప సర్పంచ్ రవీందర్ నాయక్, వార్డు సభ్యులు శ్రీను నాయక్, పాండు నాయక్, పావని సోమేశ్వర్, జటావత్ హూన్య నాయక్, రమేష్, హరిలాల్ నాయక్, పూజ దేవా నాయక్ ఆంగోత్ భాస్కర్, కేతావత్ శ్రీను, రవీందర్, గోపి, మహేష్, కొర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ నూతన చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం



**హైదరాబాద్, మే 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** పంచాయతీ రాజ్ ఈఎన్సీ భవన్లో బుధవారం తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ నూతన చైర్మన్‌గా సూదిని రాంరెడ్డి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అలాగే ట్రిబ్యునల్ సభ్యులుగా కృష్ణకుమార్ గౌడ్ నాగులూరి, బాస వేణుగోపాల్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ కార్యదర్శి కె. నాగమణి నూతన చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. ఈ వేడుకకు జోగారెడ్డి, కృపాకర్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సూదిని పద్మారెడ్డి, సూదిని మనోహర్ రెడ్డి, సూదిని లక్ష్మారెడ్డి, సూదిని అరవింద్ రెడ్డి, కాయితి సాయి రెడ్డి, మాడుగుల గ్రామవాసులు, ట్రిబ్యునల్ సభ్యుల కుటుంబ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, సభ్యులను శాలువాలు, పూల బొకేలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# డీజీపీని కలిసిన ఎల్ఎన్ రెడ్డి

**- కడ్తాలలో ఏసీపీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు వినతి**



**ఆమనగల్లు, మే 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు పెరుగుతున్న వాహనాల రద్దీని నియంత్రించేందుకు ఏసీపీ కార్యాలయం, అలాగే ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ను కోరారు. బుధవారం హైదరాబాద్‌లో డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కడ్తాల్ మండలంలోని తాజా పరిస్థితులు, ప్రజల అవసరాలపై చర్చించి వినతిపత్రం అందించారు. కడ్తాల్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కడ్తాలలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న కడ్తాల్ ద్వారా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, ప్రమాదాల నివారణకు మరియు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ విన్నపంపై డీజీపీ సానుకూలంగా స్పందించారని, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పేర్కొన్నారు.

# ఎయిర్ ఇండియా విమాన సర్వీసులకు కోత

**పెరిగిన ఇంధన ధరలే కారణం..**




**న్యూఢిల్లీ మే 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** పశ్చిమాసియా యుద్ధ సెగ వైమానిక రంగాన్ని కుదిపేస్తున్నది. పలు అంతర్జాతీయ రూట్లలో తమ వైమానిక సర్వీసులను తగ్గించనున్నట్టు, అలాగే మరికొన్ని మార్గాల్లో తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఎయిర్ ఇండియా ప్రకటించింది. జెట్ ఫ్యూయల్ ధరలు పెరుగడం, వైమానిక మార్గంలో ఏర్పడిన అవరోధాలు, ఆంక్షలు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈ ఏడాది జూన్-ఆగస్టు మధ్య దీనికి సంబంధించి సర్దుబాట్లు చేయనున్నట్టు తెలిపింది. ప్రతి నెలా 1200కుపైగా అంతర్జాతీయ విమానాలు యథావిధిగా నడుస్తాయని పేర్కొంది. మరోవైపు అంతర్జాతీయ ప్రయాణాలు మానుకోవాలన్న ప్రధాని పిలుపుతో విదేశీ ఎంక్వైరీలు 15% పడిపోయాయి.

# రికార్డుస్థాయికి విద్యార్థుల ఆత్మహత్యలు..

**- ఇప్పటివరకు ఇదే అత్యధికం**
**-2024లో 14,488 మంది బలవన్మరణం: ఎన్సీఆర్బీ**




**న్యూఢిల్లీ మే 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** దేశంలో విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య ఆందోళనకర రీతిలో పెరుగుతున్నది. 2015 నుంచి 2024 మధ్య మొత్తం 1,15,850 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. 2024లో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య రికార్డు స్థాయిలో 14,488కి చేరింది. ఇది 2023లో నమోదైన 13,892 కేసులతో పోలిస్తే 4.3 శాతం ఎక్కువ అని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ) బుధవారం విడుదల చేసిన తన నివేదికలో పేర్కొన్నది. విద్యాపరమైన ఒత్తిళ్లు, మానసిక సమస్యలు, బలహీనమైన సహాయక వ్యవస్థలు తదితర కారణాల వల్ల విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలు
2020 : 12,526
2021 : 13,089
2022 : 13,044
2023 : 13,892
2024 : 14,488

అత్యధిక బలవన్మరణాలు ఈ రాష్ట్రాల్లోనే
మహారాష్ట్ర : 13.2%
ఉత్తరప్రదేశ్ : 10.9%
మధ్యప్రదేశ్ : 10%
తమిళనాడు : 8.9%

1,15,850- 2015-24 మధ్య ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య
62.2%- పదేండ్లలో పెరుగుదల

# వైభవంగా శ్రీభక్తాంజనేయస్వామి దివ్య ప్రతిష్ట


ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు


ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు


విప్ ను సన్మానిస్తున్న గ్రామస్తులు


మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు

**ఎలిగేడు, మే 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముప్పిరితోట గ్రామంలోని నూతన ఆలయంలో శ్రీభక్తాంజనేయస్వామి దివ్య పునఃప్రతిష్టాపన మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. తోగుట--రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతిస్వామి ఆచార్యత్వంలో అశేష భక్తజనసందోహం మధ్యన ప్రత్యేక పూజా కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. ఉదయం ఆవాహిత దేవతా, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ట, ధ్వజ, మూర్తి ప్రతిష్ట, బలిహరణం, పూర్ణాహుతి, కలశోద్వాసన, అవబృథం, రుత్విక్ సన్మానం, మహాదాశీర్వచనం వంటి విశిష్ట కర్మలు నిర్వహించగా అనంతరం అన్నప్రసాదం భక్తులకు అందించారు. ఈ మహోత్సవంలో తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్ రావు, కాంగ్రెస్ నాయకులు రామిడి వెంకట్రాంరెడ్డి, దేవరాజు, కోట లాలయ్య తదితరులు పాల్గొన్నారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, ట్రినిటీ విద్యాసంస్థల అధినేత దాసరి మనోహర్ రెడ్డి కూడా స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానుపర్తి స్రవంతి మోహన్ రావు, మాజీ ఉపసర్పంచ్ చీకట్ల సంతోష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.